సాక్షి ప్రకాశం

గురువారం । 25 । జూలై । 2024



చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించండి

అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు.

- 8లో..



చిట్టీల పేరుతో మోసం

తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలో చిట్టీల పేరుతో 65 మందికి రూ.2.50 కోట్లకు టోకరా పెట్టి పరారయ్యాడో వ్యక్తి.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఢిల్లీ నిరసనలో పాల్గొన్న వారికి అభినందనలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక చర్యలపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో చేపట్టిన నిరసనాగ్రహం కార్యక్రమంలో ప్రకాశం జిల్లా నుంచి పాల్గొన్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక చర్యలను దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ తెలియజేయడంలో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్, మాజీ శాసనసభ్యులతోపాటు జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు ఇతరత్రా అన్నివర్గాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని విజయవంతం చేశారన్నారు.

30న గెస్ట్ అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

ఒంగోలు: గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు ఈనెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కాలేజీలో యూజీ సబ్జక్టులకు సంబంధించి కామర్స్, హిందీ సబ్జక్టులకు గెస్ట్ అధ్యాపకులను ఆహ్వానిస్తున్నామన్నారు. మహిళా అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని, పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. నెట్/ స్లెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, అధ్యాపకులు నేరుగా ఇంటర్వ్యూకి తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌తో ఉదయం 10 గంటలకు తమ కాలేజీలో జరిగే డెమో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

ఈవీఎంలు బెంగళూరు తరలింపు



ఈవీఎంలను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించేందుకు జిల్లాకు వచ్చిన ఈవీఎంల్లో పనిచేయని ఈవీఎంలను మామిడిపాలెం ఈవీఎం గోడౌన్ నుంచి బెంగళూరు బెల్ కంపెనీకి తరలించారు. ఆ మేరకు బుధవారం డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను పరిశీలించి బెంగళూరుకు తరలించారు. తరలించిన వాటిలో 72 కంట్రోల్ యూనిట్లు, 95 బ్యాలెట్ యూనిట్‌లు, 155 వీవీ ప్యాట్‌లు ఉన్నాయి. దీనిలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషాబేగ్, రాశేఖర్, సత్యం, రసూల్, యర్రయ్య ఇతర ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

ఆపేదెవడ్రా..?

> అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించొద్దు. అది ఏ పార్టీ వారైనా.. వైఎస్సార్ సీపీ శ్రేణులైనా సరే.. ఇదీ 2019లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టగానే ఐఏఎస్, ఐపీఎస్‌లకు సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశం. ప్రస్తుత సీఎం చంద్రబాబు నుంచి ఇలాంటి ఆదేశాలను ఆశించడం ప్రజల అమాయకత్వమే అవుతుంది.

రెడ్ బుక్ కాదు బ్లడ్ బుక్..



వైఎస్సార్ సీపీ అణచివేతే లక్ష్యంగా టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కుట్రలకు తెరలేపింది. ఆ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలపై కూటమి నేతలు దాడులకు తెగబడ్డారు. అంతటితో ఆగకుండా వైఎస్సార్ సీపీ ఆనవాళ్లు కనిపించకూడదనే ధ్యేయంతో అభివృద్ధి పనుల శిలాఫలకాలను టీడీపీ, జనసేన శ్రేణులు ధ్వంసం చేశాయి. కళ్లెం లేని గుర్రంలా దౌడు తీస్తున్న అరాచకాలను కట్టడి చేయాల్సిన పోలీసులు, ప్రభుత్వ అధికారులను తొలి రోజు నుంచే కీలుబొమ్మలుగా మార్చారు.

- ఎన్నికల ఫలితాల రోజు నుంచే టీడీపీ కూటమి అరాచకాలు మరూ
- వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలతో కూడిన శిలాఫలకాలు, విగ్రహాలు ధ్వంసం
- భయాందోళనతో మిన్నకుండిపోయిన ప్రభుత్వ ఉద్యోగులు
- ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు
- మంత్రులు, ఎమ్మెల్యేల ప్రోద్బలంతోనే దాడులని విమర్శలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఆంధ్రప్రదేశ్‌ను సింగపూర్ చేస్తా, జపాన్ చేస్తా అంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన నెల రోజులకే రాష్ట్రాన్ని సౌత్ బీహార్ చేశారనేది నూటికి నూరుశాతం నిజమని ప్రజలు, ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలన్నర రోజుల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలు పేట్రేగిపోయారు. జూన్ 4న ఒకవైపు ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగానే మరోవైపు విధ్వంసం మొదలైంది. జిల్లాలో ఎక్కడ చూసినా భయాందోళనకర పరిస్థితి. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల వద్ద శిలాఫలకాలను ధ్వంసం చేశారు. మాజీ సీఎంలు వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తాజా మాజీ ఎమ్మెల్యే చిత్రాలు కనిపిస్తే చాలు పూనకం వచ్చిన పోతురాజుల్లా ఊగిపోయారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడంతోపాటు పలుచోట్ల నిప్పు పెట్టి రాక్షసానందం పొందారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా పార్టీ విజయోత్సవాల పేరిట దాడులకు తెగబడ్డారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఇళ్లపై రాళ్లు రువ్వడంతోపాటు ఇళ్లలోకి దూరి టపాసులు పేల్చి భయభ్రాంతులకు గురిచేశారు. ఇదేం అన్యాయమని ప్రశ్నిస్తే మహిళలు, వృద్ధులని కూడా కర్రలతో చితకబాదారు.

అధికారులు గప్‌చుప్..

వైఎస్సార్ సీపీకి ఓటేశారన్న కసితో దళితులు, మైనారిటీలు, ఇతర సామాజికవర్గాలపై దాడులకు పాల్పడుతుండటంతో పచ్చ కండువా భుజాన వేసుకుని ఎవరైనా కనిపిస్తే భయంతో వణికిపోయే దుస్థితి. గతంలో ఎప్పుడూ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు జరిగిన దాఖలాలు లేవు. ఏకంగా అధికార పార్టీ కార్యకర్తలు, నాయకులే రౌడీల్లా ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేయడమే కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాలు, చిహ్నాలను ధ్వంసం చేస్తుంటే ప్రభుత్వ అధికారులు చేష్టలుడిగి చోద్యం చూశారు. కనీసం దాడికి పాల్పడిన దుండగులపై పోలీసులకు ఫిర్యాదు చేసే సాహసం కూడా అధికారులు చేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

చోద్యం చూసిన పోలీసులు

ప్రభుత్వ కార్యాలయాలపై టీడీపీ, జనసేన శ్రేణులు దాడులకు తెగబడుతున్నట్లు సమాచారం ఉన్నా పోలీసులు అడ్డుకున్న దాఖలాలు లేవు. నిందితులపై సుమోటోగా కేసులు పెట్టాలని పోలీసులు భావించినా టీడీపీ ఎమ్మెల్యేల ఒత్తిడితో వెనుకడుగు వేసినట్లు సమాచారం. ఎప్పుడైతే పోలీసులు చోద్యం చూస్తూ నిలబడ్డారో ప్రజలు కూడా ఈ దౌర్జన్యాలను, దాడులను అడ్డుకునేందుకు సాహసించలేకపోయారు. ఒకటీ రెండు చోట్ల ఇదేంటని ప్రశ్నించిన వారి మీద కూటమి నాయకులు దాడులకు పాల్పడ్డారు. కర్రలకు మేకులు కొట్టి దారుణంగా చితకబాదారు.

ఫిర్యాదులు లేవట

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినట్లు ఎలాంటి ఫిర్యాదులు లేవని అధికారులు చెప్పారు. ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినట్లు సమాచారం లేదని డీఎస్పీ కిశోర్‌బాబు తెలిపారు. ఒంగోలు నగరంలోనూ ఎలాంటి ఫిర్యాదులు రాలేదని నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు చెప్పారు. మార్కాపురం, కనిగిరి, దర్శి సబ్ డివిజన్ల పరిధిలో ఎక్కడా విధ్వంసకారులపై, దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు కాకపోవడం గమనార్హం.



జూన్ 15న వైఎస్సార్ పేరు తొలగించిన చీమకుర్తి మున్సిపాలిటీ నూతన భవనం



జూన్ 15వ తేదీ కొనకనమిట్ల మండలం చినమనగుండంలో సచివాలయ శిలాఫలకం ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్త



జూన్ 4న పొన్నలూరు మండలం విప్పగుంట గ్రామంలో టీడీపీ నేతలు జేసీబీతో కూల్చేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖద్వారం, గేట్



జూన్ 20న చీమకుర్తి మండలం దేవరపాలెంలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ శిలఫలకం



జూన్ 6వ తేదీ మర్రిపూడి మండలం గార్లపేటలో టీడీపీ కార్యకర్తలు నిప్పంటించిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు దిండు నర్సింహారావు టిఫిన్ సెంటర్

విధ్వంసాల చిట్టా ఇదిగో..



జూలై 2న పొన్నలూరు మండలం ఉప్పలదిన్నెలో సచివాలయ శిలాఫలకాన్ని గడ్డపారతో కూల్చివేస్తున్న టీడీపీ కార్యకర్తలు

ఎన్నికల ముందు రెడ్ బుక్ పేరుతో హడావుడి చేసిన టీడీపీ శ్రేణులు కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే 'బ్లడ్ బుక్'గా మార్చారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశించి ఎవరినీ వదిలేదంటూ ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన ప్రకటనలతో కూటమి శ్రేణులు మరింత రెచ్చిపోయారు. మనమేం చేసినా చర్యలు తీసుకునేవారు లేరన్న ధీమాతో బరితెగించారు. ప్రభుత్వ ఆస్తులను సైతం ధ్వంసం చేశారు.

- ఒంగోలులోని ముంగమూరు డొంకలో తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు త్యాగానికి గుర్తుగా అప్పటి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రకాశం రోడ్డు అని నామకరణం చేశారు. ఆ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కూటమి శ్రేణులు ధ్వంసం చేశాయి.
- మంగమూరు రోడ్డు జంక్షన్‌లో ఉడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలా ఫలకంపై వైఎస్ జగన్, బాలినేని చిత్రాలను పగలగొట్టారు.
- నగర శివారులోని వెంకటేశ్వర కాలనీలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.
- సంతనూతలపాడు జెడ్పీ హైస్కూల్ ఇండోర్ స్టేడియంలో శిలాఫలకం ధ్వంసంపై స్థానికులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు.
- చీమకుర్తి నూతన మున్సిపల్ భవనంపై వైఎస్సార్ పేరు తొలగించిన ఘటనపై వైఎస్సార్ సీపీ చీమకుర్తి కన్వీనర్ శేఖర్‌రెడ్డి ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు.
- పొన్నలూరు మండలం తిప్పగుంట జెడ్పీ హైస్కూల్ ఆర్చిని జేసీబీతో కూలదోశారు. ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్న సమయంలోనే టీడీపీ శ్రేణులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. అదే రోజు రాత్రి ప్రస్తుత మంత్రి బాల వీరాంజనేయ స్వామి స్వగ్రామమైన తూర్పు నాయుడుపాలెం గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు.
- జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడులో సచివాలయం, ఆర్బీకే శిలాఫలకాలను ధ్వంసం చేశారు.
- టంగుటూరు మండలం పొందూరులో సచివాలయం, ఆర్బీకే శిలాఫలకాలను ముక్కలు ముక్కలు చేశారు.
- పొన్నలూరు మండలం ఉప్పలదిన్నెలో సచివాలయం, ఆర్బీకేలపై నవరత్నాల పథకాల చిహ్నాన్ని పగలగొట్టారు. కొండపి నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్తులపై జరిగిన దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని స్థానికులు కోరినా ప్రభుత్వ ఉద్యోగులు భయంతో వణికిపోయారు.
- యర్రగొండపాలెం నడిబొడ్డున నిర్మించిన పంచాయతీ కాంప్లెక్స్ భవనంపై వైఎస్సార్ పేరు తొలగించారు.
- కొనకలమిట్ల మండలం చినమనగుండం గ్రామ సచివాలయంపై టీడీపీ జెండా ఎగరేయడమే కాకుండా శిలా ఫలకాలను ధ్వంసం చేశారు.
- దొనకొండ మండలంలో టపాసులు దూరంగా కాల్చండయ్యా పిల్లలు భయపడుతున్నారని చెప్పిన మహిళను చితకబాదారు. కూతురిని కొడుతుంటే చూడలేక అడ్డొచ్చిన తండ్రిని వృద్ధుడని కూడా చూడకుండా తల పగలగొట్టారు.







వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, మాజీ మంత్రి సురేష్, కనిగిరి ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్



ఢిల్లీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

ఢిల్లీలో నినదించిన జిల్లా గళం

రాష్ట్రంలో టీడీపీ కూటమి అరాచక, విధ్వంసక పాలనపై నిరసనగా ఢిల్లీలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన పలువురు పార్టీ నాయకులు తరలి వెళ్లారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, బుర్రా మధుసూదన్ యాదవ్, టీజేఆర్ సుధాకర్‌బాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పలువురు సీఎం జగన్‌ను కలిసి మాట్లాడారు.

– ఒంగోలు





ధర్నాకు హాజరైన బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, బుర్రా మధుసూదన్ యాదవ్, కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు

దివ్యాంగ బాలుర వసతి గృహంలో ప్రవేశాలు

ఒంగోలు సెంట్రల్: విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగ బాలుర విద్యార్థుల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన తెలిపారు. 3 నుంచి 12వ తరగతి ఆపైన ప్రత్యేక విద్యా కోర్సులు చదివే విద్యార్థులు అర్హులని చెప్పారు. శారీరక అంగవైకల్యం, పాక్షిక అంధత్వం, పాక్షిక వినికిడి లోపం కలిగి ప్రభుత్వ వైద్యశాల నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన బాలురు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వసతి గృహంలో ఉచిత భోజనం, వసతి, ప్రతి నెలా కాస్మోటిక్స్ అందజేత వంటి సదుపాయం ఉందని తెలిపారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం అవసరమైన వారికి ప్రత్యేక సహాయకుడి సౌలభ్యం కల్పిస్తారని చెప్పారు. పూర్తి వివరాలకు కార్యాలయం ఫోన్ నంబర్ 0852-281310ను పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించాలని వినతి

ఒంగోలు సెంట్రల్: దివ్యాంగుల అభ్యున్నతికి జీవో నంబర్ 43ను అమలు చేయాలని రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ టి.రవీంద్రను నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా బుధవారం విజయవాడలో కలిసి విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధికి పెద్దపీట వేయాలని జీవో 43 ఇచ్చారని గుర్తు చేశారు. త్వరలో నిర్వహించనున్న మద్యం దుకాణాల టెండర్లలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వును అమలు చేసేలా జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కూడా కలిసి విన్నవించినట్లు చెప్పారు. స్పందించిన డిప్యూటీ డైరక్టర్ డైరెక్టర్‌తో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు కాలేషా తెలిపారు. సంఘ గౌరవ అధ్యక్షుడు బాణావత వెంకటేశ్వరరావు, గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు దూపాటి రమణయ్య, బత్తుల సాయి కుమార్ పాల్గొన్నారు.



రవీంద్రకు వినతి పత్రం అందిస్తున్న సంఘ బాధ్యులు

క్లుప్తంగా

గ్రంథాలయ పితామహుడు అయ్యంకికి నివాళి



అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఒంగోలు టౌన్: గ్రంథాలయోద్యమానికి అయ్యంకి వెంకట రమణ జీవితాంతం కృషి చేశారని, ఆయన వెలిగించిన పుస్తక దీపాలు నేటికీ వెలుగులు ప్రసరింపజేస్తున్నాయని జిల్లా గ్రంథాయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ 134వ జయంతిని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత విశేషాలను వక్తలు వివరించారు. ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తుడైన అయ్యంకి ఆరోజుల్లోనే సొంతంగా 'సర్వస్వము' అనే పత్రికను స్థాపించారని, స్వాతంత్ర్య సమరయోధుడు బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలతో ఉత్తేజితుడై ప్రజాసేవకు అంకితమయ్యారని వివరించారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, అనిల్ బాబు, కృష్ణవేణి, నున్నా ఆంజనేయులు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనం విడుదల చేయాలి



మాట్లాడుతున్న సృజన్ మాదిగ

ఒంగోలు: ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు వేతన బకాయిలు విడుదల చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సృజన్‌మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మాదిగ సంక్షేమ పోరాట సమితి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దిగువస్థాయి ఉద్యోగులైన అటెండర్లు, సెక్యూరిటీ సిబ్బంది, స్వీపర్లు గత ఆరు నెలలుగా వేతనం అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దిగువ స్థాయి ఉద్యోగులను వెకిలి చేష్టలతో ఇబ్బంది పెడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాలేజీ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినా వారి ప్రవర్తనలో మార్పు కనిపించలేదన్నారు. కాలేజీలో ప్రైవేట్ క్యాంటీన్, బేకరీని టెండర్ల ద్వారా అప్పగించాలని డిమాండ్ చేశారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించండి

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందాలని, ఎటువంటి అలసత్వం లేకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ప్రకాశంభవనంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ దాని అనుబంధ విభాగాలు, ఉద్యానవన, మార్కెటింగ్, విత్తనాభివృద్ధి సంస్థ, మార్క్‌ఫెడ్, రవాణా, ఆర్టీసీ టూరిజం, చేనేత, భూగర్భ జలవనరులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులతో బుధవారం వేరువేరుగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఆయా శాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల స్థితిగతులపై ఆరా తీశారు. లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పథకాల ప్రయోజనాన్ని లబ్ధిదారులకు అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. సమావేశాల్లో ఐసీడీఎస్ పీడీ మాధురి, డీసీపీఓ దినేష్‌కుమార్, పశుసంవర్ధక అధికారి బేబిరాణి, ఉద్యాన అధికారి గోపిచంద్, మార్కెటింగ్ అధికారి ఉపేంద్ర, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ బుచ్చమ్మ, డీటీసీ సుశీల, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, పర్యాటక శాఖ అధికారి బెన్హర్, చేనేత శాఖ ఏడీ ఉదయ్‌కుమార్, భూగర్భ జలవనరుల శాఖ అధికారి విద్యాసాగర్, డీఐపీఆర్ఓ గ్రేస్‌లినోర, డీపీఆర్ఓ రమేష్, డివిజనల్ పీఆర్ఓ దుర్గాప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమరావతికి సాయం పేరుతో అప్పులపాలు చేస్తారా?

- సీపీఐ(ఎంఎల్) నేతల ధ్వజం

ఒంగోలు టౌన్: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్లో ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తామని పేర్కొనడం రాష్ట్రాన్ని మోసం చేయడమేనని సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి డీవీఎస్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆ అప్పుతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని మాటల్లో చెబుతూ చేతల్లో మాత్రం ఎలాంటి నిధులు కేటాయించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్వాసితుల ప్రస్తావన కూడా చేయలేదంటే వారికి న్యాయం జరుగుతుందా అని సందేహం వ్యక్తం చేశారు. ప్రకాశంను వెనకబడిన జిల్లాల జాబితాలో చేర్చడమే తప్ప నిధుల కేటాయింపుపై స్పష్టత ఎక్కడుందని ప్రశ్నించారు. కార్పొరేట్ల ఆదాయం నాలుగు రెట్లు పెరిగినా పన్నులు వేయకపోవడం, కార్పొరేట్ సంస్థల్లో 40 శాతం పన్నులను 30 శాతానికి తగ్గించడం ప్రభుత్వ నైజాన్ని బహిర్గతం చేస్తోందని దుయ్యబట్టారు. ఎరువులు, ఆహారం, పెట్రోలు ఉత్పత్తులపై సబ్సిడీలను తగ్గించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ గురించి వ్యూహాత్మక మౌనం పాటించడం ప్రత్యేక హోదా, రైల్వే జోన్ల గురించి ప్రస్తావించకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇది అంకెల గారడీ అని, రాష్ట్ర ప్రజలను వంచించే ఉత్తుత్తి హామీల బడ్జెట్ అని ఎద్దేవా చేశారు.

ఎన్‌జీపాడు పోలీసు స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

నాగులప్పలపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. శాంతి భద్రతలు, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్న ఆయన వీలైనంత త్వరగా కేసులు పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో నేరాలు జరగకుండా గస్తీని ముమ్మరం చేయాలని, పటిష్ట చర్యలతో నేరాలను కట్టడి చేయాలని చెప్పారు. బీట్లు తిరిగే సమయంలో హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. పోలీసు స్టేషన్లలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిబ్బంది వివరాలు, వారి విధులను ఆరా తీసిన ఆయన సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్ఐ బ్రహ్మనాయుడు, సిబ్బంది ఉన్నారు.

ఇంటి అద్దె విషయంతో ఘర్షణ



గాయపడిన రంగనాయకులు

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని పాపినేనిపల్లెలో ఇంటి అద్దె విషయంలో జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. పాపినేనిపల్లెలో ఎస్ వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంట్లో ఆటో డ్రైవర్ పిక్కిలి రంగనాయకులు అద్దెకు ఉన్నాడు. కొద్ది రోజుల క్రితం రంగనాయకులు అద్దె ఇంటిని ఖాళీ చేశాడు. ఆ సమయంలో రూ.400 బకాయి పడ్డాడు. రంగనాయకులు ఇంటిని ఖాళీ చేసి స్వగ్రామమైన తిప్పాయిపాలెం వెళ్లాడు. అద్దె బకాయి చెల్లించాలని రంగనాయకులు అత్త నల్లబోతుల వెంకటసుబ్బులు ఇంటికి వెళ్లి గట్టిగా అడిగాడు. విషయం తెలుసుకున్న రంగనాయకులు పాపినేనిపల్లెకు వెళ్లి వెంకటేశ్వర్లుతో వాదన పెట్టుకున్నాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. కర్రలు, గొడ్డలితో దాడి చేయడంతో అత్త, అల్లుడు గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

టంగుటూరు: 15 ఏళ్ల బాలికపై 50 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి యత్నించిన సంఘటన టంగుటూరు వాణీ నగర్లో మూడు రోజుల క్రితం జరగగా ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు టంగుటూరు వాణీ నగర్‌కు చెందిన ఇత్తడి విజయ్ (50) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. పోతుల చెంచయ్య వెస్ట్‌బ్ కాలనీకి చెందిన ఓ బాలిక టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బాలిక బంధువులు వాణీ నగర్లో ఉంటారు. పాఠశాల నుంచి అప్పుడప్పుడూ పోతూ వస్తూ ఉండేది. నిందితుడి ఇల్లు కూడా సమీపంలోనే ఉండేది. తరచూ బాలికతో చనువుగా ఉండేవాడు. మూడు రోజుల క్రితం బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నిస్తుండగా బాలిక కేకలు విని చుట్టుపక్కల వారు చూసి అతడికి దేహశుద్ధి చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయటానికి వెనకాడారు. అయితే బాలిక కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడు ఇత్తడి విజయ్‌ని అదుపులోకి తీసుకొని, బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం ఒంగోలు తరలించారు. కనిగిరి డీఎస్పీ రామరాజు, సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై పున్నారావు నిందితుడిని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

శభాష్ శివ ప్రసాద్...

- బంగారు నగల సూట్‌కేసును పోలీసులకు అప్పగించిన ఆటోవాలాను అభినందించిన ఎస్పీ దామోదర్



నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ శివప్రసాద్‌ను శాలువా కప్పి అభినందిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: అతడో ఆటో డ్రైవర్. పేరు శివ ప్రసాద్. ఊరు మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి. రెక్కాడితేనే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన ప్రసాద్ ప్రతిరోజూ తన స్వగ్రామం నుంచి ఒంగోలుకు వచ్చి ఆటో తోలగా వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తుంటాడు. ఎప్పటిలాగే సోమవారం ఒంగోలు వచ్చాడు. సుజాత నగర్ దగ్గరకు వచ్చే సరికి పరిటాల సురేష్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి ఆటో ఎక్కారు. కర్నూలు రోడ్డులోని లక్కీ షాపింగ్ మాల్ వద్ద దిగి పోయారు. ఆటో అద్దంకి బస్టాండు దగ్గరకు పోగానే ఆటోలో సూట్ కేసు కనిపించింది. సురేష్ కుటుంబం సూట్ కేసును మరిచి పోయినట్లు గుర్తించి అక్కడకు వెళ్లి వెదికాడు. వారు కనిపించలేదు. దాంతో తాలుకా పోలీసు స్టేషన్లో సీఐ షేక్ ఖాజావలికి అప్పగించాడు. పోలీసులు సూట్ కేసును తెరచి చూడగా అందులో రూ.2.50 లక్షల విలువైన 7 సవర్ల బంగారు హారం, నెక్లెస్ ఉన్నాయి. ఈలోపు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సురేష్ కూడా అక్కడకు వచ్చారు. విచారణ అనంతరం వారికి సూట్ కేసు, అందులోని బంగారు నగలు చూపించారు. వాటిని వారికి అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీని తెలుసుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ మంగళవారం అతడిని జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించారు. విలువైన బంగారు ఆభరణాలు దొరికినప్పటికీ ఎంతో నిజాయితీతో పోలీసులకు అప్పగించిన శివ ప్రసాద్ ను శభాష్ అంటూ అభినందించారు. శాలువా కప్పి సన్మానించారు. శివ ప్రసాద్ నిజాయితీని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ప్రమాదంలో డ్రైవర్ మృతి
- నలుగురు మహిళలకు స్వల్పగాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో పెదగోగులపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ గుర్రం గురవయ్య(65) మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సీఎస్‌పురం మండలం అరివేముల సమీపంలో చేటుచేసుకుంది. ఎస్సై ప్రేమ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని పెదగోగులపల్లి గ్రామానికి చెందిన నలుగురు మహిళలు తుమ్మకుంటలో కర్మకాండ కార్యక్రమానికి వెళ్లేందుకు ఆటో బాడుగకు మాట్లాడుకున్నారు. తిరుగుప్రయాణంలో ఉండగా మార్గమధ్యంలో అరివేముల వద్ద మలుపులో ఆటో అదుపుతప్పింది. అదే సమయంలో రోడ్డు పక్కన నిల్చున్న ఓ మహిళ ఆటో దూసుకురావడాన్ని గమనించి భయంతో వెనుకకు పడిపోయింది. ఆటో బోల్తాకొడుతున్న సమయంలో కిందకు దూకిన డ్రైవర్ గురవయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న వేల్పుల చిన్న గురవమ్మ, భూరబోయిన గురవమ్మ, గుడిపాటి నాగమ్మ, పి.నాగమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జర్నలిస్టులకు ప్రమాద బీమా ముఖ్యం



జర్నలిస్టులకు బీమా పాలసీ పత్రాలు అందిస్తున్న మణిబాబు, బొద్దులూరి

ఒంగోలు సెంట్రల్: ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ అసోషియేషన్ భవన్‌లో పోస్టల్ ప్రమాద బీమా పాలసీ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ జాలాది మణిబాబు, బీజేపీ అధికార ప్రతినిధి బొద్దిలూరి ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బీమా పాలసీతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.అజయ్‌బాబు, ఒంగోలు వసంత్ కుమార్, అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి వేసుకోగు కోటయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త నేర చట్టాలు వద్దంటే వద్దు

- పార్లమెంట్‌లో తక్షణమే ఉపసంహరించాలి
- వామపక్షాల డిమాండ్



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

ఒంగోలు టౌన్: ప్రజా వ్యతిరేక నూతన నేర చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. కొత నేర చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలకు పోతోందని, ప్రజాస్వామ్య, లౌకిక స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, న్యాయమూర్తులు, మేధావులతో చర్చించకుండా ఏకపక్షంగా కొత్త నేర చట్టాలను ప్రవేశపెట్టడం ఏమిటని నిలదీశారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మూడు వ్యవసాయ చట్టాలను తెచ్చిన మోదీ ప్రభుత్వం రైతాంగం నుంచి వచ్చిన వ్యతిరేకతతో ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోకుండా కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. నూతన నేర చట్టాలు చాలా ప్రమాదరకమైనవని, దేశ ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, సీపీఎం నాయకులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎస్ స్వామి, ఎం.సాయి, సీపీఐ న్యూ డెమొక్రసీ నాయకుడు సాగర్ పాల్గొన్నారు.

విద్యార్థుల మృతదేహాలకు పోస్టుమార్టం



మృత దేహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్



అంత్యక్రియల్లో పాల్గొన్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

- కుటుంబ సభ్యులకు అప్పగింత

కనిగిరి రూరల్: మండలంలోని పునుగోడు వద్ద విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన నజీర్, గౌతమ్, బాలాజీ మృతదేహాలకు శవ పంచనామా నిర్వహించి బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. అనంతరం ముగ్గురు యువకుల మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో వారి వారి సంప్రదాయల ప్రకారం ముగ్గురి అంత్యక్రియలు నిర్వహించారు. చేతికి అందివచ్చిన కుమారులు మృత్యువడి చేరడంతో మృతుల తల్లిదండ్రులు చేసే ఆర్తనాదాలతో మిన్నంటాయి. విద్యార్థుల మృతదేహాలకు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వేర్వేరుగా సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కౌన్సిలర్ రామనబోయిన శ్రీను, రసూల్, నాగూర్‌బీ, భాను, షకీలా తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సంఘ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సంఘ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: ది ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎ-1 ఫంక్షన్ సమావేశ మందిరంలో ఎన్నుకున్నారు. జెమిని శ్రీనివాసరావు, మట్టా సత్యం, ఉదయ్ హరిబాబు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించారు. సంఘటితంగా ఎదుర్కోవాల్సిన సమస్యలపై వక్తలు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షునిగా దగ్గుబాటి వెంకటరావు, ఉపాధ్యక్షునిగా ఉప్పుటూరి చంద్రా, సెక్రటరీగా దొడ్డా చంద్రశేఖర్, కోశాధికారిగా షేక్ రసూల్, జాయింట్ సెక్రటరీలుగా చెన్నుపాటి భాస్కరరావు, గోపిశెట్టి శ్రీనివాసరావులు ఉన్నారు. నూతనంగా ఎన్నుకున్న అధ్యక్షుడు దగ్గుపాటి వెంకట రావు, నూతన బాధ్యులు మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులకు ధన్యవాదాలు చెప్పారు. సంఘ అభివృద్ధికి పాటు పడుతూ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ సభ్యులందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్స్ పద్మ స్టూడియో మహేశ్వరరావు, స్టార్ స్టూడియో రామచంద్రారావు, రేఖా స్టూడియో లక్ష్మయ్య, గోపిక్రిష్ణ స్టూడియో గోపి, సిరి స్టూడియో రమేష్‌లను ఘనంగా సన్మానించారు. శర్వాణి రమేష్ కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో కఠారి లక్ష్మణరావు, సారిక శ్రీను, నిమ్మగడ్డ రమేష్, బంగారు, మన వెంకటేష్, ప్రదీప్, ఒంగోలు నగరంలోని ఫొటో, వీడియోగ్రాఫర్స్, కలర్ ల్యాబ్స్, మిక్సింగ్ సెంటర్స్, ఫొటో గూడ్స్, ఫ్రేమ్ వర్క్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయంపై టీడీపీ జెండా

మద్దిపాడు: మద్దిపాడు మండలంలోని ఘడియపూడి, గార్లపాడు గ్రామాలకు గార్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయంపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు టీడీపీ జెండా ఎగురవేశారు. సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఉన్న మండలంలో ఇప్పటి వరకూ ఎక్కడా ఎటువంటి గొడవలు లేకుండా ఉందని ఆ రెండు గ్రామాలకు చెందిన యువకుల అత్యుత్సాహం మళ్లీ గొడవలకు దారితీస్తుందేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గ్రామ సచివాలయం ప్రస్తుతం మద్దిపాడు వద్ద ఉన్న ఘడియపూడి పునరావాసకాలనీలో అద్దె భవనంలో ఉండేది. గత ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున గార్లపాడులో ఘడియపూడి సచివాలయాన్ని ప్రారంభించారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.



ఘడియపూడి సచివాలయంపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసిన దృశ్యం

దివ్యాంగుల జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్న వారికి జాతీయ పురస్కారాలు అందించేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జీ అర్చన తెలిపారు. డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రదానం చేస్తారన్నారు. దివ్యాంగులు, వ్యక్తులు, సంస్థలు ఈ పురస్కారానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 31వ తేదీ లోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్ సైట్ అడ్రస్: www.depwd.gov.in లేదా www.awards.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ 08592-281310 నంబర్‌లో కార్యాలయ పనివేళల్లో, రోజుల్లో సంప్రదించాలన్నారు.

పొగాకు చూర గరిష్ట ధర రూ. 208

- రెండు కేంద్రాల్లో చూర కొనుగోళ్లు

ఒంగోలు సెంట్రల్: పొగాకు చూర సైతం డబుల్ సెంచరీ దాటి రికార్డులు సృష్టిస్తోంది. ఒంగోలు రీజియన్ పరిధిలో పొదిలి, టంగుటూరు కేంద్రాల్లో బుధవారం కొనుగోళ్లు జరిగినట్లు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. టంగుటూరు కేంద్రంలో పొగాకు చూర గరిష్టంగా రూ.208, కనిష్టంగా రూ.168 పలికినట్లు చెప్పారు. రెండు కేంద్రాల్లో 701 బేళ్లు రాగా 538 బేళ్లు కొనుగోలు చేసి 163 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. పొదిలి కేంద్రంలో 412 బేళ్లు రాగా 292 బేళ్లు కొనుగోలు చేసి 120 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.143, కనిష్ట ధర రూ.60, సరాసరి రూ.76.38 పలికింది. టంగుటూరు వేలం కేంద్రంలో 289 బేళ్లు రాగా 246 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయగా వివిధకారణాలతో 43 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.208, కనిష్ట ధర రూ.168, సరాసరి రూ.90.70గా నమోదైంది.

చిట్టీల పేరుతో మోసం

- 65 మందికి రూ.2.50 కోట్లకు టోకరా



చిట్టీల పేరుతో మోసపోయామంటున్న బాధితులు

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో చిట్టీల పేరుతో 65 మందికి రూ.2.50 కోట్లతో టోకరా పెట్టి పరారయ్యాడు. గ్రామానికి చెందిన పఠాన్ సుభానీ చిట్టీల పేరుతో మోసం చేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పఠాన్ సుభానీ వద్ద సుమారు 65 మంది సభ్యులు కూలీనాలీ చేసుకున్న నగదుతో చిట్టీ వేయడంతో పాటు, ఎక్కువ వడ్డీ వస్తుందని ఆశతో అతనికి వడ్డీకి నగదు ఇచ్చారు. కొంతకాలంగా నమ్మకంగా గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల వారి నుంచి చిట్టీలు వేయించాడు. అయితే అతను కుటుంబసభ్యులతో కలిసి రాత్రికి రాత్రే గ్రామం నుంచి పరారు కావడంతో రూ.2.50 కోట్ల మేర నష్టపోయినట్లు బాధితులు రోడ్డెక్కారు. పఠాన్ సుభానీ ఆచూకీ కనుగొని మాకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

అయ్యంకికి ఘన నివాళి



అయ్యంకికి నివాళులర్పిస్తున్న ఎంఈవో, గ్రంథపాలకురాలు

యర్రగొండపాలెం: గ్రంథాలయ పితామహుడు, ఉద్యమ నేత అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.ఆంజనేయులు, గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీ, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో...



పెద్దదోర్నాలలో..

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి రమణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యంకి రమణయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు డీవీ సుబ్బారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మణ్‌నాయక్, ఫిషరీస్ అసిస్టెంట్ రంగనాయకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్ని జయంతిని ఘనంగా నిర్వహించారు.

అర్హులకు కౌలురైతు కార్డులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ సుబ్బారెడ్డి

తాళ్లూరు (ముండ్లమూరు): అర్హులకు కౌలు రైతు కార్డులు మంజూరు చేయనున్నట్లు ఒంగోలు ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పంట సాగుదారుల పత్రం ప్రచార కరపత్రాలను ఆవయ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గ్రామ సభల్లో భూమి కౌలుకు తీసుకున్న రైతులు కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హత ఆధారంగా మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సభల్లో కౌలు రైతులకు పంట సాగుదారుల చట్టం 2019పై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. డీబీఆర్సీ రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కో ఆర్డినేటర్ గోపనబోయిన వెంకటరావు, కౌలు రైతులు పాల్గొన్నారు.

వరిలో కొత్త రకాలతో అధిక దిగుబడులు

- కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రమేష్



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

దర్శి: వరిలో కొత్త రకాలు వేసుకుంటే అగ్గి తెగులు దోమ పోటును తట్టుకుని అధిక దిగుబడులు సాధించ వచ్చని కేవీకే సమన్వయకర్త డాక్టర్ బి.రమేష్ తెలిపారు. స్థానిక కేవీకేలో షెడ్యూల్ కులాలు, రైతులకు వరి, మిరప పంటలో పాటించాల్సిన ముఖ్యమైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చు తగ్గిచుకునే దిశలో పంటలు వేసుకోవాలన్నారు. వరిలో డ్రమ్ సీడ్ పద్ధతి ద్వారా నాటుకుంటే 30 శాతం వరకు ఖర్చు తగ్గించుకోవడమేగాక ఆరోగ్యకర అధిక పిలకలు కలిగిన మంచి దిగుబడులు వస్తాయని వివరించారు. ఉద్యాన వన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ మిరప పంటలో రకాలు ఎంపిక, సమగ్ర యాజమాన్య పద్ధతులు వివరించారు. బీఏఐఎఫ్ సంస్థ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే డయేరియా నివారణ



పుల్లలచెరువు: విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పుల్లలచెరువు: పరిశుభ్రతతోనే డయేరియా నివారణ సాధ్యం అని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి లక్ష్మీనరసింహం అన్నారు. బుధవారం మండలంలోని గిరిజన పాఠశాలలో డయేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ డయేరియా నుంచి బయట పడాలంటే వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. డెంగీ బారిన పడకుండా ఉండాలంటే దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో దోమలు అభివృద్ధి చెందే ప్రమాదం ఉందని, వాటి నుంచి రక్షణ పొందాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే మార్గం అని అన్నారు. ముఖ్యంగా చిన్నారులు భోజనం చేసే సమయంలో చేతులను పరిశుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. పెద్దవారు కూడా అలా చేస్తే కొన్ని రోగాల నుంచి బయటపడొచ్చని చెప్పారు.

మంగినపూడిలో పారిశుధ్య పనులు

దొనకొండ: మండలంలోని మంగినపూడిలో పంచాయతీ కార్యదర్శి నాగార్జున ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా కాలువలో పూడికతీత, బ్లీచింగ్ చల్లటం వంటి పనులు చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు నాగార్జున తెలిపారు.



దొనకొండలో పూడిక తీస్తున్న కార్మికుడు

పాఠశాల విద్యార్థులకు ఆటోలు



ఆటోలు ప్రారంభించిన సర్పంచ్, ఎంఈఓలు

త్రిపురాంతకం: చదువుకునేందుకు జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు పడుతున్న అవస్థలు చూసి సర్పంచ్ అనూష ఆటోలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కె.తులసి మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దూపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు రోజూ కాలి నడకను హసానపురం, దీవేపల్లి గ్రామాల నుంచి సుమారు ఐదు కిలోమీటర్లు 50 మంది విద్యార్థులు నడిచి రావడంతో వారి ఇబ్బందులు గమనించిన సర్పంచ్ ఎనిబెర అనూష రెండు ఆటోలను సమకూర్చింది. ఈ గ్రామాల నుంచి ఎటువంటి రవాణ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. విద్యార్థులు మధ్యలో చదువు ఆపి డ్రాపౌట్‌గా మారకుండా ఇది ఎంతో దోహదపడుతుందని ఎంఈఓలు పేర్కొన్నారు. రెండు ఆటోలను ప్రారంభించారు. విద్యార్థులను ఏడాది పొడవున తీసుకురానున్నట్లు తెలిపారు. సీఆర్పీ శ్యామ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో ఎమ్మెల్యే బూచేపల్లి



జిల్లా నేతలతో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి: ఏపీలో 51 రోజుల్లో 31 హత్యలు, 300పైగా హత్యాయత్నాలు, టీడీపీ నేతల వేధింపులతో 35 మంది ఆత్మహత్యలు, 4500 చోట్ల ప్రైవేటు ఆస్తుల ధ్వంసం, 490 ప్రభుత్వ ఆస్తులు విధ్వంసం, రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా చేస్తున్న దాడులను జాతీయ స్థాయిలో తెలియజేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం జరిగిన ధర్నాలో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరయ్యారు. నల్ల బ్యాడ్జిలతో తమ నిరసన తెలిపారు. అనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి దర్శి నియోజకవర్గంలో జరిగిన ఘటనల గురించి వివరించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొనకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జి.కోటేష్, ఎంపీ సంజన వ్యాయామ ఉపాధ్యాయులు కాలే నరసింహారావు ప్రోత్సాహంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21వ తేదీన పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన సెలక్షన్స్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ ఈ నెల 25 నుంచి 28 వరకు హర్యానా రాష్ట్రంలోని ఖరక్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టులో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి వారిని అభినందించారు. పాఠశాలకు మంచి పేరు తెచ్చిపెట్టాలని ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు, జి.కోటేశ్వరరావు ఆకాంక్షించారు.

పారదర్శకంగా లెప్రసీ గుర్తింపు సర్వే



కుష్టువ్యాధిపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పుల్లలచెరువు: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీనరసింహం అన్నారు. బుధవారం మండలంలోని నాయుడుపాలెం లెప్రసీ సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క ఇంటినీ వదలకుండా ప్రతి ఒక్కరికీ కుష్టు నిర్ధారణ పరీక్ష చేయాలన్నారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగులో మచ్చలు, ఒకటి లేదా ఐదు మచ్చలు ఉంటే వ్యాధిగా అనుమానించి వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ఈ సర్వే ఆగస్టు 2వ తేదీ వరకు గ్రామాల్లో సాగుతోందని, ఈ వ్యాధి గురించి భయపడాల్సిన పనిలేదన్నారు. వ్యాధి తగ్గేందుకు పూర్తి స్థాయిలో మందులు ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని, దీనిపై ప్రజలు పూర్తి అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న పీవీ రమణ

దొనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు పండ్ల తోట పెంపకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పీవీ రమణ, అగ్రికల్చర్ అధికారి ఆర్.రమేష్, డూమా కోర్స్ డైరెక్టర్ శ్యాంసన్ పాల్గొని మాట్లాడారు. పండ్ల మొక్కలు ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉచితంగా అందజేస్తున్నారని, గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో నాటుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు అందజేస్తున్నామని, కావాల్సిన రైతులు సంబంధిత ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఏపీఓ టి.దేవయ్య, ఎన్ఆర్ఈజీఎస్ కో ఆర్డినేటర్, మండల కో ఆర్డినేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించండి



మాట్లాడుతున్న బాలాజీనాయక్

దొనకొండ: ఈ ఏడాది గ్రామాల్లో భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులను గుర్తించి వారికి సీసీఆర్సీ కార్డులు అందించాలని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ తెలిపారు. మండలంలోని పోలేపల్లిలో బుధవారం కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సొంత పొలం సాగు చేసుకున్న రైతుల మాదిరిగానే కౌలు రైతులకు కూడా ప్రభుత్వ పథకాలు అందించడానికి కౌలు కార్డులు తప్పని సరి అని తెలిపారు. సీసీఆర్సీ కార్డుల కోసం ఆధార్ కార్డు, పొలం 1బి తీసుకుని గ్రామ సచివాలయాలంలో గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలన్నారు. కౌలు కార్డులతో రైతులకు పంట నమోదు చేసుకునేందుకు, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు, పండిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణం పొందేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామాల్లోని కౌలు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, వీఆర్ఓ ఆర్.గాలయ్య, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయరెడ్డి, సిబ్బంది కె.వీరాంజనేయులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తపాలా శాఖ పథకాలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసులు

దర్శి: పోస్టాఫీసుల్లో ఉన్న సేవింగ్స్ పథకాలు, బీమా పథకాలు, డిజిటల్ ఖాతాలు వంటి సౌకర్యాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం పోస్టల్ డివిజన్ తపాలా సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో డాక్ చౌపాల్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పథకాలు వివరాలు తెలుసుకోవడం కోసం తమ పరిధిలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని కోరారు. ప్రస్తుతం ప్రజలకు అన్నీ రకాలుగా పోస్టల్ సేవలు అందించడంలో సిబ్బంది చక్కగా పనిచేస్తున్నారని చెప్పారు. సహాయ సూపరింటెండెంట్ మదన్‌మోహన్, పొదిలి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మెయిల్ ఓవర్సర్ శ్రీనివాసులు, ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పుల్లలచెరువు ఆటల పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు

పుల్లలచెరువు: క్రీడలతో మానసిక ఉల్లాసం ఉంటుందని కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లీల్లీప్రకాశ్‌వాణి అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంలో పాటు శారీరక దారుఢ్యం కూడా ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఎంతో మంచి భవిష్యత్ ఉంటుందని, నేడు మన దేశంలో ఎంతో మంది క్రీడాకారులు ఎన్నో రంగాల్లో రాణించి మంచి స్థాయిలో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో ముందుకుసాగాలన్నారు. సంప్రదాయ క్రీడలపై ఆసక్తి పెంచుకుని వాటిని ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం

యర్రగొండపాలెం: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక వికాసానికి దోహదపడతాయని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. బుధవారం విద్యావారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. క్రీడల పట్ల ఎక్కువగా ఆసక్తి పెంచుకునే విద్యార్థులకు అనారోగ్యం దరిచేరదని, ఇమ్యూనిటీ శక్తి పెరుగుతుందన్నారు. క్రీడలను హెచ్ఎం రమాదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో-2 మల్లునాయక్‌లు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ హెచ్ఎం చెన్నకేశవులు, పీడీ మాథ్యూస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



సీమ పందుల పెంపక కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్

పుల్లలచెరువు: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని పశుసంవర్ధశాఖ డిప్యూటీ డైరెక్టర్ యోగానంద ప్రసాద్ అన్నారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో మండలంలోని కవలకుంట్లలో రూ.60 లక్షలతో సీమపందుల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని బుధవారం డీడీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు పలు సూచనలు చేసి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు పోను ప్రభుత్వానికి చెల్లించేవి కూడా సకాలంలో చెల్లించేలా లబ్ధిదారులు ఉండాలన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో లబ్ధిదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటి మార్కెట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏడీ రమేష్‌కుమార్, డాక్టర్లు నాగుల్‌మీరా, ప్రవల్లిక బాయ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్ కొడుతున్న నగర పంచాయతీ సిబ్బంది

దర్శి: పట్టణంలోని వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. నగర పంచాయతీ కమిషనర్ మహేష్ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది మోటార్ సైకిల్‌పై ఫాగింగ్ యంత్రాలతో వీధి వీధిలో తిరిగి ఫాగింగ్ చేశారు. ఇటీవల కురిసిన చిరు జల్లులకు దోమలు వృద్ధి చెందాయి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దోమకాటుతో వ్యాపించకుండా దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ పొగను వీధుల్లో కొట్టారు.

జాషువాకు ఘన నివాళి



కళాకారులను సత్కరిస్తున్న దళిత నాయకులు

దర్శి: మహాకవి గుర్రం జాషువా వర్ధంతి దర్శి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. గుర్రం జాషువా పద్యాలను ఆలపించారు. కళాకారులను సత్కరించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో రాష్ట్ర దళిత సేన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఆర్ఎస్ శాస్త్రవేత్త వరప్రసాద్ మాట్లాడుతూ సమాజం కోసం గుర్రం జాషువా రచించిన పద్యాలు సమాజాన్ని మేల్కొల్పాయన్నారు. సంఘ సేవకులు జీవీ రత్నం, దళిత సేన, ప్రజాసంఘాల నాయకులు రాచపూడి మోషే, గర్నెపూడి ప్రేమ్‌కుమార్, గోవింద్ ప్రసాద్, డగ్లస్, జీవీ రత్నం, ఇర్మియా, జోసెఫ్, నాగమణి, జాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- ఒంగోలు ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి

ముండ్లమూరు:

మండలంలో వివాదాస్పదంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భూసమస్యలపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పసుపుగల్లులో గతంలో మాజీ సైనికులకు కేటాయించిన భూమిని వేరే వారు ఆ భూమి తమకు సంబంధించినది అనడంతో ఆంతర్యమేమిటని అధికారులను ప్రశ్నించారు. కార్యాలయంలోని కొందరు అధికారులు గ్రామస్తులకు సహకరించడంతో మాజీ సైనికుల భూ సమస్య పెండింగ్‌లో ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. కొందరికి వత్తాసు పలుకుతూ పని తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం మాజీ సైనికులకు భూమిని కేటాయిస్తే అందుకు వారిని ఇబ్బంది పెటడం తగదన్నారు. ఇప్పటికే పలు సార్లు మాజీ సైనికులు జిల్లా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. వారి సమస్య పరిష్కరించాలని నోటీసులు పంపినా చర్యలు తీసుకోకపోవడంపై కార్యాలయంలో పని చేసే కొందరి పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రస్తుతం ఆ భూమికి సంబంధించిన అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా మాజీ సైనికుల భూ సమస్య పరిష్కరించాన్నారు. తహసీల్దార్ జె.మధుబాబు, ఆర్డీఓ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ రాము, డీటీ పుల్లారెడ్డి, ల్యాండ్ సర్వే డీటీ స్రవంతి, ఆర్ఐ కేవీ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ పోగుల శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుబ్బారెడ్డి

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



మొక్కలు నాటుతున్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

త్రిపురాంతకం: విద్యార్థుల తరగతికి తగిన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని రామసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెరుగైన విద్య కోసం అందరూ కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగు పరిచేందుకు అనేక పథకాలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఈయన వెంట ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్, ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు ఉన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.